

23 ఏళ్లకు మోక్షం..

రామప్ప దేవాలయంలోని సోమసూత్రం మూసుకుపోవడంతో రెండు రోజులుగా పురావస్తుశాఖ సిబ్బంది డ్రిల్లింగ్ పనులు చేపట్టి పునరుద్ధరించారు. - 8లో



అపరాలపై అనాసక్తి..!

అపరాల సాగుపై రైతులు ఆసక్తి చూపకపోవడంతో పప్పు దినుసులను ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది. - 8లో

గరిష్ఠం/కనిష్ఠం 35.2°/22.0°

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం కాస్త ఎండ తీవ్రత ఉంటుంది. రాత్రివేళ ఉక్కపోతగా ఉంటుంది.



ఆదా చేస్తేనే ఉచితం!

ఫిబ్రవరి నెల వినియోగంపై జీరో బిల్లు

- 200 యూనిట్ల లోపు విద్యుత్ వాడిన వారికి వర్తించిన పథకం
- జిల్లాలోని వినియోగదారులకు రూ.2.06కోట్లు ఆదా
- మరో 1,349 మందికి లబ్ధి చేకూరే అవకాశం



సాక్షి, మహబూబాబాద్: అధికార కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీలను అమలు చేస్తూ ముందుకెళ్తోంది. ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేసేందుకు పక్కా ప్రణాళికతో వెళ్తోంది. ఈమేరకు గృహలక్ష్మి పథకంలో భాగంగా 200యూనిట్ల లోపు విద్యుత్ వినియోగదారులకు ఫిబ్రవరి నెల జీరో బిల్లు వర్తింపజేసింది. ఈనెల ఒకటో తేదీ నుంచి 15వ తేదీ వరకు బిల్లులు సేకరించి అర్హులైన వారికి జీరో బిల్లులు అందజేశారు. అయితే అన్ని అర్హతలు ఉన్నా 200కు పైగా యూనిట్ల విద్యుత్ వినియోగించిన వారు ఇంకొంచెం తక్కువ వాడుకుంటే బిల్లు మొత్తం మాఫీ అయ్యేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

87,416 కుటుంబాలకు లబ్ధి

పథకంలో భాగంగా 200యూనిట్ల లోపు విద్యుత్ వినియోగించిన పేదలకు ఫిబ్రవరి నెలలో జీరో బిల్లు వచ్చింది. ఈ వినియోగం ద్వారా పేదలు చెల్లించే డబ్బులు ప్రభుత్వమే అందిస్తుందని విద్యుత్ ఉద్యోగులు చెప్పడంతో బిల్లులు చూసినవారు సంతోషపడుతున్నారు. జిల్లా వ్యాప్తంగా 3,28,780 విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. ఇందులో 2,09,246 కనెక్షన్లు గృహ అవసరాల కోసం విని యోగించేవి ఉన్నాయి. ఉద్యోగులు, ఇతర దారిద్రరేఖకు ఎగువన ఉండి తెల్లరేషన్ కార్డులు లేకుండా ఉన్నవారు 42,191పోగా మిగిలిన 1,67,055 కుటుంబాలు ఈ పథకానికి అర్హత పొందాయి. అయితే ఇందులో 200 యూనిట్లకు తక్కువగా విద్యుత్‌ను వినియోగించిన కనెక్షన్లు 88,765 ఉండగా.. ఆధార్ నంబర్ తప్పుగా పడిన వారు, రేషన్ కార్డుల్లో పేర్లు తప్పులు, పేరుమార్పిడి మొదలైన కారణాలతో 1,349 కుటుంబాలకు బిల్లు వచ్చింది. మిగిలిన 87,416 కుటుంబాలు ఈ పథకం ద్వారా లబ్ధిపొందాయి. వినియోగించిన విద్యుత్‌కు గాను రూ.2.06కోట్ల బిల్లు వచ్చినా.. పథకానికి లబ్ధిదారులు కావడంతో వీరికి జీరో బిల్లుగా పరిగణించారు.

జీరో విద్యుత్ బిల్లు లబ్ధిదారుల వివరాలు

డివిజన్	గృహ విద్యుత్ కనెక్షన్లు	అర్హులు	జీరో బిల్లు	డబ్బులు(లక్షలు)
మహబూబాబాద్	1,06,881	57,259	56,440	రూ. 135.55
తొర్రూరు	60,174	31,506	30,976	రూ. 70.88
మొత్తం	1,67,055	88,765	87,416	రూ.206.43

సామాన్యులపై భారం తగ్గుతోంది



గత నెల వరకు కరెంట్ బిల్లు వస్తుందంటే భయమయ్యేది. బిల్లు ఎంత వస్తుందో.. కట్టకపోతే ఎప్పుడు కనెక్షన్ తొలగిస్తారో అని ఇంట్లో ఖర్చులకు కూడా లేకుండా కరెంట్ బిల్లు చెల్లించే వాళ్లం. ఇప్పుడు ఈనెల జీరో బిల్లు అంటూ కాగితం చేతిలో పెట్టి వెళ్లారు. సంతోషంగా ఉంది. మాలాంటి మధ్య తరగతి కుటుంబాలకు ఈ పథకం తోడ్పాటుగా ఉంటుంది.

– బొల్లోజు పద్మ, కేసముద్రం విలేజీ

సంతోషం కలిగింది



ఈనెల కరెంట్ బిల్లు జీరో వచ్చింది. రూ.228 బిల్లులో చూపించారు. కింద జీరో బిల్లుగా ఉంది. సంతోషంగా ఉంది. బస్సులో ఫ్రీగా వెళ్లి వస్తున్నాం. పనిచేసుకుంటూ జీవించే వాళ్లకు ఇది ఎంతగానో ఉపయోగపడుతుంది. అదే విధంగా విద్యుత్‌ను కూడా పొదుపుగా వాడుకోవాలనే అలోచన కలుగుతుంది. ఏది ఏమైనా మా కుటుంబానికి లాభం జరిగింది.

– దూదికట్ల పద్మ, కురవి

పొదుపుగా వాడుకుంటే లాభం



ప్రభుత్వం పేదలకు అందజేస్తున్న 200యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ పథకం జిల్లాలో ఫిబ్రవరి నుంచే అమలు అవుతుంది. గత నెలలో వినియోగించిన విద్యుత్‌కు బిల్లులు తీశాం. ఇందులో అర్హత పొందిన వారికి జీరో బిల్లుగా పరిగణించి డబ్బులు కట్టొద్దని చెప్పాం. అయితే ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి. పొదుపుగా వాడుకుంటేనే ఈ పథకం వర్తిస్తుంది.

– నరేష్, ఎస్ఈ, మహబూబాబాద్

ఎన్నికల నిబంధనలు పాటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్

మహబూబాబాద్: ఎన్నికల నిబంధనల మేరకు కరపత్రాలు, ప్రచార సామగ్రి ప్రింట్ చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ ప్రింటింగ్ ప్రెస్ యజమానులను ఆదేశించారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో బుధవారం కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ అదనపు కలెక్టర్ డేవిడ్‌తో కలిసి ప్రింటింగ్ ప్రెస్ యజమానులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. కరపత్రాలు, పోస్టర్ల ప్రింటింగ్‌లో నిబంధనలు పాటించాలన్నారు. ముద్రించే వ్యక్తి తనకు వ్యక్తిగతంగా తెలిసిన ఇద్దరి సంతకాలతో రెండు డిక్లరేషన్ ప్రతులను ప్రింటర్‌కు ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో జెడ్పీ డిప్యూటీ సీఈఓ నర్మద, ప్రింటర్ల యాజమానులు వీరభద్రాచారి, యాకూబ్‌రెడ్డి, రామకృష్ణ, నాగార్జున, రమేష్, రాజు, వీఎస్ చారి తదితరులు పాల్గొన్నారు.

అధికారుల సేవలను వినియోగించుకోవాలి

- డీఏఓ అభిమన్యు

పెద్దవంగర: రైతులు వ్యవసాయాధికారుల సేవలను వినియోగించుకోవాలని డీఏఓ అభిమన్యు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని పలు ఫర్టిలైజర్ దుకాణాలను ఏఓ కుమార్‌యాదవ్‌తో కలిసి డీఏఓ తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి సక్రమంగా నిర్వహించాలని సూచించారు. షాపుల్లో ధరల పట్టికను కచ్చితంగా ఉంచాలన్నారు. రైతులు ఖరీదు చేసిన ఎరువులకు ఫర్టిలైజర్ షాపుల నిర్వాహకులు రశీదులు ఇవ్వాలన్నారు. నకిలీ ఎరువులు, విత్తనాలు విక్రయించొద్దని హెచ్చరించారు. ప్రభుత్వ నిబంధనలు పాటించాలన్నారు. యూరియా రైతులకు సరిపడే విధంగా అందుబాటులో ఉన్నట్లు డీలర్లకు తెలిపారు. ఏఈఓలు అందుబాటులో ఉండి రైతులకు ఎప్పటికప్పుడు సలహాలు, సూచనలు అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఫర్టిలైజర్ షాపుల నిర్వాహకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



షాపులో తనిఖీ చేస్తున్న డీఏఓ

న్యూస్‌రీల్

తాగునీటి సమస్యపై దృష్టి సారించాలి



డోర్నకల్: గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అడిషనల్ కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో ఆదేశించారు. డోర్నకల్ మున్సిపాలిటీలోని పలు వార్డుల్లో బుధవారం ఆయన పర్యటించారు. జెడ్పీహెచ్ఎస్ సెంటర్‌లోని ఎల్ఐజీహెచ్ క్వార్టర్ల స్థలాన్ని ఇండోర్ స్టేడియం నిర్మాణానికి పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. యాదవనగర్‌లోని సైడ్ డ్రెయినేజీలను పరిశీలించారు. అనంతరం అమ్మపాలెం క్రాస్‌రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్‌ను తనిఖీ చేసి అక్కడ విధులు నిర్వహిస్తున్న సిబ్బందితో మాట్లాడారు. అలాగే తహసీల్దారు బంజరతో పాటు మరో గ్రామాన్ని పరిశీలించి అభివృద్ధి పనులను పరిశీలించారు. తాగునీటి వసతుల గురించి స్థానికులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నరేష్‌రెడ్డి, హెల్త్ అసిస్టెంట్ అహ్మద్, బంజర పంచాయతీ కార్యదర్శి అన్వర్ తదితరులు పాల్గొన్నారు.

నోటి శుభ్రతతోనే ఆరోగ్యం



తొర్రూరు: నోటి శుభ్రతతోనే ఆరోగ్యం సాధ్యమని డిప్యూటీ డీఎంహెచ్ఓ గుండాల మురళీధర్ అన్నారు. వరల్డ్ ఓరల్ హెల్త్ డేను పురస్కరించుకుని బుధవారం డివిజన్ కేంద్రంలోని అంబేడ్కర్ నగర్ ప్రాథమిక పాఠశాలలో నోటి శుభ్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. దంత వైద్యురాలు డాక్టర్ మీరాజ్ నోటి శుభ్రత, దంతాల ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. డిప్యూటీ డీఎంహెచ్ఓ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు దంతాల శుభ్రత పాటించాలని, లేదంటే వ్యాధులు సంక్రమిస్తాయన్నారు. ప్రతి ఆరు మాసాలకోమారు దంత వైద్యుడిని సంప్రదించి పుచ్చు పళ్లు రాకుండా నివారించుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులకు బ్రష్, పేస్టులు అందించారు. కార్యక్రమంలో వైద్యులు జ్వలిత, ప్రియాంక, హెచ్ఎం రాజసుకన్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆస్తి పన్ను సకాలంలో చెల్లించాలి



తొర్రూరు: ఆస్తి పన్ను సకాలంలో చెల్లించాలని మున్సిపల్ కమిషనర్ శాంతికుమార్ తెలిపారు. ఆస్తి పన్ను వసూళ్లలో భాగంగా పురపాలక శాఖ ఆధ్వర్యంలో బుధవారం డివిజన్ కేంద్రంలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. డప్పు చప్పుళ్ల నడుమ గులాబీలు అందిస్తూ ఆస్తి పన్ను వసూళ్లపై అవగాహన కల్పించారు. కమిషనర్ మాట్లాడుతూ.. ఆస్తి పన్ను బకాయి కలిగిన వారికి 90 శాతం వడ్డీ రాయితీ ఉందని, కేవలం 10శాతం వడ్డీతో ఆస్తి పన్ను చెల్లించే వెసులుబాటు కల్పిస్తున్నామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మేనేజర్ కట్టా స్వామి, హెల్త్ అసిస్టెంట్ రాజు, వార్డు ఆఫీసర్లు దేవేందర్, పట్టాభి, నవీన్, ఉపేంద్ర, రేణుక పాల్గొన్నారు.

జాతీయస్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపిక



అజంత,



శ్రావణి

కేసముద్రం: మండలంలోని కల్వల మోడల్ స్కూల్ విద్యార్థినులు దారావత్ అజంత, బానోతు శ్రావణి జాతీయస్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు బేస్‌బాల్ అసోసియేషన్ జిల్లా సెక్రటరీ కల్లూరి ప్రభాకర్‌రావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.ఇటీవల కరీంనగర్‌లో జరిగిన సెలక్షన్ ట్రైల్స్‌లో ప్రతిభ కనబరిచిన వారిద్దరు జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఈనెల 21నుంచి పంజాబ్ రాష్ట్రంలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు చెప్పారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి

- డీఆర్‌డీఓ పురుషోత్తం

కురవి: ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని డీఆర్‌డీఓ పురుషోత్తం అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని నాగార్జున విద్యాలయంలో పార్లమెంట్ ఎన్నికల స్వీప్ కార్యక్రమంలో భాగంగా ఓటు హక్కు వినియోగంపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ ఒక్క విద్యార్థి ఓటు హక్కు ప్రాధాన్యతను కుటుంబ సభ్యులకు వివరించాలని సూచించారు. ఓటు హక్కు వినియోగించుకోవడం ద్వారా మంచి ప్రభుత్వాన్ని ఎన్నుకునే అవకాశం ఉంటుందన్నారు. అనంతరం కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ బి.రవి, తహసీల్దార్ సునీల్‌రెడ్డి, ఎంపీడీఓ వీరబాబు, మండల సమాఖ్య అధ్యక్షురాలు మామిడాల అలేఖ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

వేసవిలో మొక్కలను సంరక్షించుకోవాలి

వేసవికాలంలో నర్సరీలో పెరుగుతున్న మొక్కలను సంరక్షించుకోవాలని డీఆర్‌డీఓ పురుషోత్తం అన్నారు. బుధవారం సీరోలు మండలం తాళ్లసంకీస గ్రామంలోని నర్సరీని సందర్శించి, మొక్కల పెరుగుదలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మొక్కలను బతికేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఓ యాకాంబ్రం, ఈసీ కైలా, టీఏ అరుణ్, పంచాయతీ కార్యదర్శి ఠాగూర్, ఫీల్డ్ అసిస్టెంట్ హతీరాం పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న డీఆర్‌డీఓ పురుషోత్తం

మెరుగైన సేవలందించాలి

డోర్నకల్: విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా వినియోగదారులకు మెరుగైన సేవలందించాలని ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి ఆదేశించారు. మండలంలోని గొల్లచర్ల విద్యుత్ సబ్‌స్టేషన్‌ను బుధవారం ఆయన తనిఖీ చేశారు. సబ్‌స్టేషన్ యార్డును పరిశీలించి విద్యుత్ సరఫరా సామర్థ్యం గురించి సిబ్బందితో చర్చించారు. వివిధ స్థాయి సిబ్బంది వివరాలు తెలుసుకుని వారితో మాట్లాడారు. విద్యుత్ అవసరాల రీత్యా మరో సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని సీఎండీ దృష్టికి తీసుకెళ్లగా సర్వే నిర్వహించి నివేదిక అందించాలని ఆదేశించారు. ఎస్ఈ నరేష్, డీఈ విజయ్‌కుమార్, ఏడీఈ రమేష్, ఏఈ కిరణ్, లైన్ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

24 గంటల విద్యుత్ అందించాలి

నర్సింహులపేట: పంటల సాగు కోసం వ్యవసాయానికి 24గంటల విద్యుత్ అందించాలని ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి అన్నారు. మండలంలోని పెద్దనాగారం 33/11 కేవీ సబ్ స్టేషన్‌ను బుధవారం సీఎండీ ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. ట్రాన్స్‌ఫార్మర్లు, పరిసరాలు, మెటీరియల్‌ను పరిశీలించారు. ఎస్ఈ నరేష్, డీఈలు అనిల్, మధుసూదన్, ఏడీఏ లోక్‌నాథ్, ఏఈలు ఉన్నారు.



మాట్లాడుతున్న సీఎండీ వరుణ్‌రెడ్డి

అంతరాయం లేని విద్యుత్ సరఫరాకు చర్యలు

తొర్రూరు: వేసవిలో అంతరాయంలేని విద్యుత్ సరఫరాకు ముందస్తు కార్యాచరణ చేపట్టామని ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి అన్నారు. బుధవారం డివిజన్ కేంద్రంలోని విద్యుత్ శాఖ డివిజనల్ కార్యాలయాన్ని సందర్శించారు. విద్యుత్ సరఫరా తీరుతెన్నులపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

విద్యార్థులు క్రమశిక్షణ అలవర్చుకోవాలి

మహబూబాబాద్ అర్బన్: విద్యార్థులు క్రమశిక్షణ అలవర్చుకొని ఉన్నత చదువులు చదవాలని డీఈఓ రామారావు అన్నారు. మానుకోట మున్సిపల్ పరిధిలోని అనంతారం మోడల్ స్కూల్‌ను డీఈఓ ఆకస్మికంగా సందర్శించారు. పాఠశాలలో వసతులు, విద్యాబోధన, మధ్యాహ్న భోజనం వివరాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తొమ్మిదో తరగతి విద్యార్థులు వేసవి సెలవుల్లో ముందస్తుగా పదో తరగతి పుస్తకాలను చదవాలని సూచించారు. విద్యార్థులు చెరువులు, వాగులు, కుంటల వద్దకు ఈతకు వెళ్లొద్దన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ అమరావతి,అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణకు చర్యలు

- డీఎస్పీ తిరుపతిరావు

మహబూబాబాద్ రూరల్: శాంతి భద్రతల పరిరక్షణకు చర్యలు తీసుకుంటున్నామని డీఎస్పీ తిరుపతిరావు అన్నారు. పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమలులో భాగంగా మహబూబాబాద్ రైల్వేస్టేషన్, పట్టణంలో బుధవారం పోలీసులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతిరోజు పోలీసుల తనిఖీలు కొనసాగుతాయని, ప్రజలు ఇందుకు సహకరించాలన్నారు. ఎన్నికల సంఘం నిబంధనల అమలులో భాగంగా ప్రత్యేక బృందాలు గస్తీ తిరుగుతాయని, అనుమానం ఉన్న వస్తువులు, వ్యక్తులపై ఆరా తీస్తున్నామని తెలిపారు. రైల్వే స్టేషన్, ఆర్టీసీ బస్టాండ్, నెహ్రూ సెంటర్, ఇతర ప్రధాన కూడళ్లలో బాంబు స్క్వాడ్ తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో మహబూబాబాద్ టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్, ఎస్సైలు అరుణ, శివ, జీఆర్పీ ఎస్సై సురేష్, బాంబు స్క్వాడ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఒక్కొక్కరుగా..

బీఆర్‌ఎస్‌ను వీడుతున్న కీలక నేతలు

- కాంగ్రెస్, బీజేపీల ఆపరేషన్ ఆకర్ష్.. ఉమ్మడి వరంగల్‌లో సత్ఫలితాలు
- కడియం కావ్య అభ్యర్థిత్వంపై జేఏసీ నేతల కినుక
- ఉద్యమ నేతలతో పోచంపల్లి, దాస్యం, పెద్దిల భేటీ
- గులాబీ దళపతి కేసీఆర్‌ను కలిసి మాట్లాడిస్తామని హామీ
- పార్టీ మారుతారని 'ఎర్రబెల్లి'పై ప్రచారం.. వివరణ ఇచ్చిన దయాకర్
- ఉమ్మడి వరంగల్‌లో వేడెక్కుతున్న రాజకీయాలు





సాక్షిప్రతినిధి, వరంగల్:

లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఉమ్మడి వరంగల్‌లో రాజకీయాలు వేడెక్కుతున్నాయి. ప్రధాన రాజకీయ పార్టీల్లో రోజుకో తీరుగా జరుగుతున్న పరిణామాలు ఆయా పార్టీల కేడర్‌ను అయోమయానికి గురి చేస్తున్నాయి. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు చేపట్టిన ఆపరేషన్ ఆకర్ష్ సత్ఫలితాలిస్తోంది. నిన్న మొన్నటి వరకు అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్‌లో పదవులు అనుభవించిన కొందరు కీలక నేతలు ఒక్కొక్కరుగా పార్టీని వీడుతుండటాన్ని ఆ పార్టీ ముఖ్యులు జీర్ణించుకోలేకపోతున్నారు. కాంగ్రెస్, బీజేపీలో చేరుతుండటం కేడర్‌లో చర్చనీయాంశమవుతోంది. ఇందులో ఆ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, ఎంపీలు కూడా ఉండటం గమనార్హం. ఇప్పటికే ఎంపీ పసునూరి దయాకర్, మాజీ ఎమ్మెల్యేలు తాటికొండ రాజయ్య, అరూరి రమేష్, మాజీ ఎంపీ అజ్మీరా సీతారాం నాయక్, డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు సహా పలువురు కీలక నేతలు కారు దిగారు. గ్రేటర్ వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. తాజాగా కడియం కావ్యను వరంగల్ ఎంపీ అభ్యర్థిగా ప్రకటించడంపై కొందరు తెలంగాణ ఉద్యమకారులు కినుక వహించి బహిరంగంగానే భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. అయిందేదో అయింది.. ఉన్న వారినైనా ఏకతాటిపై తెచ్చేందుకు అధిష్టానం రంగంలోకి దిగడం బీఆర్‌ఎస్‌లో చర్చనీయాంశంగా మారింది.

అభ్యర్థుల ప్రకటనపై ఉద్యమకారుల కినుక...

లోక్‌సభ ఎన్నికలకు రాజకీయ పార్టీలు సన్నద్ధమవుతున్న తరుణంలో తెలంగాణ ఉద్యమకారులు, కేయూ జేఏసీ నాయకులు పలువురు తెలంగాణ ఉద్యమంలో కీలకంగా వ్యవహరించిన వారికే బీఆర్‌ఎస్ టికెట్ ఇవ్వాలన్న డిమాండ్ తెరపైకి తెచ్చారు. ఇదే సమయంలో ఈ నెల 13న వరంగల్ ఎంపీ అభ్యర్థిగా డాక్టర్ కడియం కావ్య పేరును పార్టీ అధిష్టానం ప్రకటించగా.. ఉద్యమకారులు కొందరు ఆమెకు కాకుండా ఉద్యమంలో పాల్గొన్న వారికే ఇవ్వాలంటూ నిరసన తెలిపారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఇతర నాయకులు, వరంగల్ జిల్లాకు సంబంధించిన ముఖ్యులు వారితో మాట్లాడే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. దీంతో రంగంలోకి దిగిన పార్టీ అగ్రనేతలు ఇద్దరు.. వారితో చర్చలు జరపాలని మాజీ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డిలకు సూచించినట్లు తెలిసింది. హనుమకొండ హంటర్‌రోడ్డులోని మాస్టార్జీ కాలేజీలో బోడ డిన్న, జోరిక రమేష్, నిరంజన్, చింతల యాదగిరి, సదానందం, బండి రజనీకుమార్ తదితరులతో మంగళవారం సుమారు గంటన్నర పాటు చర్చలు జరిపినట్లు ఆలస్యంగా తెలిసింది. ఉద్యమంతో సంబంధం ఉన్న వారికే టికెట్ ఇవ్వాలని, కేసీఆర్‌తో తమను మాట్లాడించాలని తెగేసి చెప్పినట్లు సమాచారం. ఇందుకు 'మేము అగ్రనేతల సూచన మేరకు మాట్లాడుతున్నాం. ఏమన్నా ఉంటే సార్‌తో మాట్లాడుదాం.. కేసీఆర్ సార్‌తో తప్పకుండా మాట్లాడిస్తాం.. అప్పటిదాకా పార్టీతో డిఫర్ కావద్దు' అని సంప్రదింపుల కమిటీ హామీ ఇవ్వడంతో వేచిచూసే ధోరణి కొనసాగుతోంది.

'ఆకర్ష్'నేతలే అభ్యర్థులు... కాంగ్రెస్, బీజేపీల పాచికలు

కారణాలేమైనా కాంగ్రెస్, బీజేపీలు అమలు చేస్తున్న 'ఆకర్ష్'లో భాగంగా పార్టీలు మారిన నేతలే లోక్‌సభ అభ్యర్థులు అవుతున్నారు.

- మహబూబాబాద్ మాజీ ఎంపీ, బీఆర్‌ఎస్ ఉద్యమ నేత ప్రొఫెసర్ అజ్మీరా సీతారాం నాయక్ పలుమార్లు పార్టీ అగ్రనేతలను కలిసే ప్రయత్నం చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లోనూ కీలకంగా పని చేసిన ఆయన ఈసారైన తనకు ఎంపీ టికెట్ ఇవ్వాలన్న కోరికను బీఆర్‌ఎస్ మన్నించలేదు. దీంతో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి సమక్షంలో కమలం కండువా కప్పుకున్న సీతారాం నాయక్‌కు ఆ పార్టీ అధిష్టానం మహబూబాబాద్ ఎంపీ అభ్యర్థిగా ప్రకటించింది.
- బీఆర్‌ఎస్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు, వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ వరంగల్ ఎంపీ టికెట్ ఆశించగా అధిష్టానం విముఖత వ్యక్తం చేసిందన్న ప్రచారం ఉంది. ఇదే సమయంలో మాజీ ఉప ముఖ్యమంత్రి, ఎమ్మెల్యే కడియం శ్రీహరి కూతురు డాక్టర్ కడియం కావ్యను వరంగల్ అభ్యర్థిగా ప్రకటించింది. దీంతో రమేష్ బీజేపీ పార్టీలో చేరగా.. ఆయనే బీజేపీ వరంగల్ ఎంపీ అభ్యర్థి కానున్నారు.
- కనీసం సభ్యత్వం కూడా లేని వారిని ఎంపీ అభ్యర్థి చేశారన్న ఆవేదన వ్యక్తం చేసిన బీఆర్‌ఎస్ సిట్టింగ్ ఎంపీ పసునూరి దయాకర్ పార్టీకి, పదవికి రాజీనామా చేసి కాంగ్రెస్ గూటికి చేరారు. ఆయనే కాంగ్రెస్ పార్టీ వరంగల్ ఎంపీ అభ్యర్థి అయ్యే అవకాశం ఉందన్న ప్రచారం బుధవారం నుంచి సాగుతోంది.
- ఎంపీ, మాజీ ఎంపీ, మాజీ ఎమ్మెల్యేలు కాకుండా మున్సిపల్ కార్పొరేషన్, మున్సిపాలిటీల చైర్మన్లు, కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్‌ను చేరుతుండటం కలకలం రేపుతోంది.
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు బీజేపీలో చేరుతున్నారన్న వార్తలు వచ్చాయి. దీనిపై ఆయన మంగళవారం హనుమకొండలో జరిగిన విలేకరుల సమావేశంలో వివరణ ఇచ్చారు. తాను బీఆర్‌ఎస్‌ను వీడేది లేదని స్పష్టత ఇచ్చారు. దోపిడీదారులే పార్టీని వీడుతున్నారని, తాను కార్యకర్తలకు ఎల్లప్పుడు అండగా ఉంటానని చెప్పుకొచ్చారు.

వాహనాల వేలం ఆదాయం రూ.5లక్షలు

గూడూరు: వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాల వేలం ద్వారా ప్రభుత్వానికి రూ.5.12లక్షల ఆదాయం సమకూరిందని మహబూబాబాద్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ బి.కిరణ్ అన్నారు. బుధవారం స్థానిక ఎక్సైజ్ కార్యాలయంలో 9 వాహనాలకు నిర్వహించిన వేలంలో గూడూరు, నర్సంపేట, భూపాలపల్లి, మహబూబాబాద్, హనుమకొండకు చెందిన 80మంది పాల్గొని విజయవంతం చేసినట్లు తెలిపారు. గూడూరు ఎక్సైజ్ సీఐ భిక్షపతి, ఎస్సై రాజేశ్వరి, స్టేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీని తనిఖీ చేసిన డీఎంహెచ్‌ఓ

మరిపెడ: మరిపెడలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డీఎంహెచ్ఓ కళావతిబాయి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రంలోని ఫార్మసీ, లేబర్‌గది, వార్డులు, రిజిస్టర్లు తనిఖీ చేసి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. అనంతరం ఆమెను పీహెచ్‌సీ వైద్య బృందం శాలువాతో సత్కరించింది. డాక్టర్ మానస, శాంతారాణి, మంగమ్మ, కృష్ణ, సుధాకర్, సుదర్శన్, బాలాజీ, సరళ, సోములు తదితరులు పాల్గొన్నారు.

గంజాయి స్మగ్లర్ల అరెస్ట్, రిమాండ్

● 2 కిలోల 900 గ్రాముల సరుకు స్వాధీనం



అరెస్టు చూపుతున్న పోలీసులు

మడికొండ: గంజాయి తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు మడికొండ సీఐ ప్రతాప్ తెలిపారు. ఈ మేరకు బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. కాజీపేట మండలం బొడగుట్టకు చెందిన కొంగరి పవన్ కల్యాణ్, కాజీపేట రహమత్‌నగర్‌కు చెందిన వేల్పుల ఆనంద్, కాజీపేట వైఎస్ఆర్ నగర్‌కు చెందిన గాలి తరుణ్ స్నేహితులు. వీరిలో వేల్పుల ఆనంద్ కొంత కాలంగా విశాఖపట్నం అరకులో గుర్తుతెలియని వ్యక్తుల వద్ద గంజాయి కొనుగోలు చేస్తున్నాడు. అనంతరం చిన్న ప్యాకెట్ల రూపంలో ఎక్కువ ధరకు కల్యాణ్, తరుణ్ ద్వారా కాజీపేటలో విక్రయించి వారికి కొంత మొత్తం లాభం ఇస్తున్నాడు. అయితే కల్యాణ్, తరుణ్ తమకు కూడా ఎక్కువ లాభం కావాలని డిమాండ్ చేశారు. దీంతో ముగ్గురు విశాఖపట్నం అరకు వెళ్లి అక్కడ గుర్తు తెలియని వ్యక్తుల వద్ద 2కిలోల 900 గ్రాముల ఎండు గంజాయి కొనుగోలు చేశారు. బుధవారం కాజీపేట రైల్వే స్టేషన్‌లో దిగారు. అనంతరం బైక్‌పై అయోధ్యపురం రైల్వే గేట్ పక్క దారి నుంచి గంజాయి తీసుకొస్తున్నారు. ఈ క్రమంలో అక్కడ పెట్రోలింగ్ నిర్వహిస్తున్న ఎస్సై దివ్య, సిబ్బంది వారిని అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా ఎండు గంజాయి లభించింది. దీంతో ముగ్గురిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ ప్రతాప్ తెలిపారు. సమావేశంలో ఎస్సై దివ్య, ఏఎస్సై చంద్రమౌళి పాల్గొన్నారు.

విజ్ఞాన శాస్త్రంపై పరిశోధనలు జరగాలి

హన్మకొండ : విజ్ఞాన శాస్త్రంపై పరిశోధనలు జరగాలని, ఆధునిక ప్రపంచంలో సైన్స్ అనేక సవాళ్లను ఎదుర్కొంటుందని కాకతీయ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ తాటికొండ రమేశ్ అన్నారు. హనుమకొండ నయీంనగర్ వాగ్దేవి కళాశాలలో బుధవారం '21వ శతాబ్దంలో వృక్ష విజ్ఞాన శాస్త్రంలో ఆధునిక పోకడలు' అనే అంశంపై వర్క్‌షాప్ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కేయూ వీసీ రమేశ్ పాల్గొని వర్క్‌షాపును ప్రారంభించి మాట్లాడారు. తెగుళ్లను తట్టుకునే వ్యాధి నిరోధక వంగడాలు, అధిక ఉత్పత్తి, పోషకాలు కలిగిన వంగడాలను ఉత్పత్తి చేయాల్సిన అవసరముందన్నారు. ఆ దిశగా శాస్త్రవేత్తలు మరింత కృషి చేయాలని సూచించారు. అనంతరం బ్రోచర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కళాశాల అకడమిక్ డైరెక్టర్ వాహినీ దేవి, ప్రిన్సిపాల్ శేషాచలం, వృక్ష శాస్త్ర అధ్యాపకులు పాల్గొన్నారు.

అపరాలపై అనాసక్తి..!

ఏటా పడిపోతున్న పప్పు దినుసుల సాగు

- వరి, పత్తి సాగు పైనే మోజు
- ఉమ్మడి వరంగల్ జిల్లాలో మొత్తం సాగు వానాకాలం 15,11,644, యాసంగి 9,08,035 ఎకరాలు
- పప్పు దినుసుల సాగు వానాకాలం 11,140, యాసంగి 7,337 ఎకరాలు

అపరాలు సాగు ఇలా.. (ఎకరాల్లో)

జిల్లా	వానాకాలం	యాసంగి
హనుమకొండ	595	153
వరంగల్	980	189
మహబూబాబాద్	5158	5,511
ములుగు	80	1,155
జయశంకర్ భూపాలపల్లి	184	358
జనగామ	4,143	240

ఉమ్మడి వరంగల్‌లో వరి సాగు ఇలా..

వరి సాధారణ సాగు 6,09, 787 ఎకరాలు

	వానాకాలం	యాసంగి
	8,99,515	6,51,387
గతేడాది	9,12,227	7,05,162



హన్మకొండ: ఏటికేడు పడిపోతున్న అపరాల సాగు ఆందోళన కలిగిస్తోంది. అపరాల ఉత్పత్తులపై రైతులు ఆసక్తి చూపకపోవడంతో నిత్యావసరంగా మారిన పప్పు దినుసులను ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది. వరి, పత్తి సాగుపై ఆసక్తి చూపుతున్న రైతులు.. పప్పుదినుసుల సాగు అంటేనే కొంత వెనుకంజ వేస్తున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో పత్తి, వరిసాగు విస్తీర్ణం, అపరాల సాగు గణాంకాలు చూస్తే రాబోయే రోజుల్లో కొన్ని పంటలు కనిపించకుండా పోయే ప్రమాదముందన్న విషయం స్పష్టమవుతోంది. ఒక వైపు పప్పుదినుసుల ధరలు చుక్కలనంటుతుండగా ఈ పంటల సాగుకు ఎందుకు మొగ్గుచూపడం లేదో అర్థంకాని పరిస్థితి నెలకొంది. మాంసాహారంతో సమానంగా పోషకాలు అందించే పప్పు దినుసుల సాగు పెంపుపై వ్యవసాయ అధికారులు, రాష్ట్ర ప్రభుత్వం సీరియస్‌గా దృష్టిసారించాల్సిన అవసరం ఉందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

46,371 ఎకరాల్లోనే అపరాల సాగు..

ఉమ్మడి వరంగల్ జిల్లాలో అన్ని పంటలు కలిపి వానాకాలంలో 15,11,644 ఎకరాలు, యాసంగిలో 9,08,035 ఎకరాల్లో సాగు చేశారు. ఇందులో వరి వానాకాలం 8,99,515 ఎకరాలు యాసంగిలో 6,51,387 ఎకరాల్లో, పత్తి 5,26,727 ఎకరాల్లో సాగు చేశారు. అపరాల సాధారణ సాగు 46,371 ఎకరాలుకాగా, వానాకాలంలో 11,140 ఎకరాలు, యాసంగిలో 7,337 ఎకరాల్లో మాత్రమే సాగైంది. ఇందులో కంది వానాకాలంలో 6,231, యాసంగిలో 84 ఎకరాలు, పెసర వానాకాలంలో 4,727, యాసంగిలో 3,601, మినుములు వానాకాలంలో 177, యాసంగిలో 879 ఎకరాల్లో, శనగ యాసంగిలో 153 ఎకరాల్లో, బొబ్బెర యాసంగిలో 2,547 ఎకరాల్లో మాత్రమే సాగు చేశారు. ధాన్యం నిల్వలు పెరిగిపోయి క్రయవిక్రయాలు సమస్యగా పరిణమించడంతో ప్రభుత్వం వరి సాగు విస్తీర్ణం తగ్గించేందుకు కృషి చేస్తుంది. వరి సాగుతో ఏర్పడే ఇబ్బందులను వ్యవసాయ శాఖ ద్వారా ప్రచారం చేసినా పంట విస్తీర్ణం మాత్రం పెరుగుతూనే ఉంది.

వేలలో నుంచి వంద ఎకరాలకు పడిపోయిన అపరాల సాగు..

పప్పు దినుసుల పంటల సాగు వేలలో నుంచి వంద ఎకరాలకు పడిపోయింది. ఈ పంటలను ఎంత పెంచాలని ఆశిస్తున్నారో అంతకంటే వేగంగా సాగు పడిపోతోంది. ఫలితంగా ఆహార భద్రతపై తీవ్ర ప్రభావం చూపుతోంది. పెరుగుతున్న జనాభా మేరకు అపరాల ఉత్పత్తి లేకపోవడం దిగుమతులపై ఆధారపడాల్సి వస్తోంది. అపరాల పంటలైన కంది, పెసర, మినుములు, శనగ, బొబ్బెర సాగు క్షీణిస్తోంది. కంది, పెసర, మినుములు కొద్దిగా సాగు చేస్తున్న శనగ సాగు కనిపించడం లేదు. బొబ్బెర నామమాత్రంగా ఎవరో ఒకరు సాగు చేస్తున్నారు.

కష్టానికి తగిన ఫలితం రాకపోవడంతోనే సాగుపై అనాసక్తి..

ఉమ్మడి వరంగల్ జిల్లాలో కొన్ని ప్రాంతాల్లో రైతులు అపరాల సాగు చేయాలని భావించినా శ్రమకు తగిన ఫలితం లేకపోవడంతో పాటు కనీస మద్దతు ధర లభించకపోవడం, సరైన మార్కెటింగ్ సౌకర్యం లేకపోవడం, సాగు నీరు పుష్కలంగా అందుబాటులోకి రావడం, ప్రభుత్వం నుంచి సాగుపై ప్రోత్సాహం కరువవడం, విత్తనాలకు రాయితీ ఇవ్వకపోవడం, కోతుల బెడద, తదితర కారణాలు పప్పు దినుసుల సాగుకు అవరోధంగా మారాయి. ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి రైతులను ప్రోత్సహిస్తేనే అపరాల సాగు పెరిగే అవకాశముంది.

కోతుల బెడద ఎక్కువ ఉంది



నాకు ఉన్న 5 ఎకరాల పొలంలో వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్న. గతంలో కందులు, పెసర్లు, బొబ్బర్లు లాంటి పప్పు దినుసుల పంటలు పండించేది. అయితే కోతుల బెడద ఎక్కువ కావడంతో పంటలు చేతికి వచ్చే వరకు నమ్మకం లేకుండా పోయింది. అన్ని రకాల పంటలపై కోతులు దాడులు చేసి నాశనం చేస్తున్నాయి. దీంతో అపరాల సాగు చేపట్టడం లేదు. దీంతో పప్పులు కొనుక్కోవాల్సిన దుస్థితి నెలకొంది. కోతులు బెడద పోతేనే కూరగాయలు, పప్పు దినుసులు పండిస్తాం.

- దామెర బాల్ సర్పయ్య, కేసిరెడ్డిపల్లి, బచ్చన్నపేట

వరి, పత్తి పంటల వైపే మొగ్గు



నాకు నాలుగు ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఒకప్పుడు నీటి లభ్యత లేక వర్షాల పై ఆధారపడి పప్పు దినుసుల పంటలు సాగు చేసేవాళ్లం. ప్రస్తుత పరిస్థితుల్లో నీటి లభ్యత పెరగడంతో వరి, పత్తి పంటలు సాగు చేసేందుకు మొగ్గుచూపుతున్నాం. పప్పు దినుసుల సాగులో లాభాలు ఉన్నా కొంత ఎక్కువ శ్రమ చేయాల్సి వస్తుంది. దీనికి తోడు పప్పు దినుసులు విక్రయించడానికి సరైన మార్కెటింగ్ వ్యవస్థ లేకపోవడంతో వరి, పత్తి, మొక్కజొన్న సాగుకు ప్రాధాన్యం ఇస్తున్నాం.

-పల్లె బక్కిరెడ్డి, కమలాపూర్

హ్యాండ్‌బాల్, క్రికెట్ రెండు కళ్లు



మాట్లాడుతున్న హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రావు

- హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రావు
- హ్యాండ్‌బాల్ ఉమ్మడి వరంగల్ జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక

వరంగల్ స్పోర్ట్స్ : హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఎన్నికల్లో అర్జునుడిలా పోరాడి విజయం సాధించానని హెచ్‌సీఏ ప్రెసిడెంట్, తెలంగాణ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఏ జగన్‌మోహన్‌రావు అన్నారు. బుధవారం ఉమ్మడి వరంగల్ జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ జనరల్ బాడీ సమావేశం హనుమకొండ నక్కలగుట్టలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో జరిగింది. వరంగల్ ఒలింపిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బైరబోయిన కైలాస్‌యాదవ్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి జగన్మోహన్‌రావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. హెచ్‌సీఏ ప్రెసిడెంట్ అయినప్పటికీ మొదట తాను హ్యాండ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడినని మరవనన్నారు. హ్యాండ్‌బాల్, క్రికెట్ రెండు క్రీడలు తనకు రెండు కళ్లు అన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోనే డీఎస్ఏలో కొనసాగుతున్న హ్యాండ్‌బాల్ అకాడమీని ఇక్కడి నుంచి తరలించాలని కొందరు చూస్తున్నారని, ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి ఇక్కడే కొనసాగేలా కృషి చేస్తానన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో క్రికెట్‌లో ప్రతిభ గల క్రీడాకారులను గుర్తించి వారికి మెరుగైన శిక్షణ అందిస్తామన్నారు. అందుకోసం మొదటిసారి వరంగల్ జిల్లా వేదికగా ఏప్రిల్‌లో వేసవి శిక్షణ శిబిరం నిర్వహించి ప్రతిభ గల క్రీడాకారులకు హైదరాబాద్‌లోని ఉప్పల్ స్టేడియంలో శిక్షణ అందిస్తామన్నారు. అతి త్వరలో వరంగల్ క్రికెట్ స్టేడియం నిర్మిస్తామన్నారు. అనంతరం ఉమ్మడి వరంగల్ జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. చైర్మన్‌గా బొద్దిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, అధ్యక్షుడిగా ఇండ్లనాగేశ్వర్‌రావు, ప్రధాన కార్యదర్శిగా బొడ్డు విష్ణువర్ధన్, ఉపాధ్యక్షులుగా పోగుల అశోక్, సాంబరాజు రాజ్‌కుమార్, జాయింట్ సెక్రటరీగా బీ అశోక్, కోశాధికారిగా బి నరేందర్, కార్యవర్గ సభ్యులుగా సంతోష్, శ్రీధర్, చందర్, శ్రీను తదితరులు ఎన్నికైనట్లు తెలిపారు. సమావేశంలో వరంగల్ ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు అజీజ్‌ఖాన్, వరంగల్ క్రికెట్ సంఘం కార్యదర్శి చాగంటి శ్రీనివాస్, హ్యాండ్‌బాల్ సంఘం రాష్ట్ర బాధ్యుడు ఫ్రాంక్లీన్, కబడ్డీ సంఘం జిల్లా అధ్యక్షుడు ఆకుల సారంగపాణి, అథ్లెటిక్స్ సంఘం జిల్లా కార్యదర్శి సారంగపాణి, మూగల కుమార్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



ఇండ్ల నాగేశ్వర్‌రావు



బొడ్డు విష్ణువర్ధన్

విద్యుత్‌షాక్‌తో వ్యక్తి మృతి

● బావిలో పూడిక తీసేందుకు వెళ్లగా ఘటన..



రమేష్ మృతదేహం

కేసముద్రం: వ్యవసాయ బావిలో పూడిక తీసేందుకు వెళ్లిన ఓ వ్యక్తి విద్యుత్‌షాక్‌కు గురై అక్కడిక్కడే మృతి చెందాడు. ఈ ఘటన బుధవారం మండలంలోని బేరువాడలో చోటుచేసుకుంది. ఎస్సై వంశీధర్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన బానోత్ రమేష్(38)గ్రామంలోని ఓ రైతుకు చెందిన వ్యవసాయబావిలో పూడిక తీయడానికి వెళ్లాడు. క్రేన్ డబ్బా సాయంతో బావిలో పూడికను బయటకు పంపుతున్నాడు. ఈక్రమంలో బావిలోని మోటార్‌ను సరిచేస్తుండగా అప్పటికే ఆ మోటార్‌కు విద్యుత్ సరఫరా అవుతుండడంతో ఒక్కసారిగా షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. అక్కడున్న వారు గమనించి క్రేన్ సాయంతో మృతదేహన్ని బయటకు తీశారు. ఘటనా స్థలిని మహబూబాబాద్ రూరల్ సీఐ సర్వయ్య, ఎస్సై వంశీధర్ పరిశీలించారు. అనంతరం కేసు నమోదు చేసుకుని మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం మానుకోట జిల్లా ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య విజయ, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కాగా, తమకు న్యాయం చేయాలంటూ సంబంధిత రైతు ఇంటి ఎదుట మృతదేహంతో బాధిత కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు. ఈ క్రమంలో గ్రామపెద్దలు కల్పించుకుని సర్దిచెప్పడంతో ఆందోళన విరమించారు.

వెల్దిలో ఆర్టిజన్ కార్మికుడు..



రవి (ఫైల్)

రఘునాథపల్లి: ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతు చేస్తున్న ఓ ఆర్టిజన్ కార్మికుడు విద్యుదాఘాతంతో మృతి చెందాడు. ఈ ఘటన బుధవారం మండలంలోని వెల్దిలో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం .. వెల్ది గ్రామానికి చెందిన బర్మ రవి (51) మండలంలోని ఖిలాషాపూర్ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఆర్టిజన్ కార్మికుడిగా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఇటీవల డిప్యూటేషన్‌పై అశ్వరావుపల్లి సబ్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. స్వగ్రామంలోని ఓ వినియోగదారుడి ఇంటికి విద్యుత్ సరఫరా కాకపోవడంతో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఏబీ స్విచ్ ఆఫ్ చేశాడు. అనంతరం ఇండ్లకు సింగిల్ ఫేజ్ విద్యుత్ సరఫరా అయ్యే (బుడ్డి) ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతు నిమిత్తం స్తంభం ఎక్కి సరి చేస్తుండగా విద్యుత్‌షాక్‌కు గురై కిందపడ్డాడు. దీంతో తీవ్ర గాయాలుకావడంతో చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. కాగా, ట్రాన్స్‌ఫార్మర్ ఆఫ్ చేసినప్పటికీ కొందరి ఇంట్లో ఉన్న ఇన్‌వర్టర్ ద్వారా విద్యుత్ సరఫరా కావొచ్చని..? లేదా సింగిల్ ఫేజ్‌లైన్ పైనే త్రీఫేజ్ లైన్ వెళ్తుండడంతో ఆ తీగలు తాకి రవి విద్యుదాఘాతంతో మృతి చెంది ఉండొచ్చని పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతుడికి భార్య యాదలక్ష్మి, కుమారుడు, కూతురు ఉన్నారు. కాగా, అందరితో కలివిడిగా ఉండే రవి మృతితో కుటుంబంతోపాటు గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

23 ఏళ్లకు మోక్షం..



ఆలయం బయట నుంచి గర్భగుడిలోకి డ్రిల్లింగ్ వేస్తున్న సిబ్బంది



సోమసూత్రాన్ని పునరుద్ధరించడంతో గర్భగుడి నుంచి బయటకు వస్తున్న నీరు

సాక్షి ఎఫెక్ట్..

- 'సాక్షి' కథనాలతో కదిలిన కేంద్ర పురావస్తుశాఖ
- సోమసూత్రం పునరుద్ధరణ పనులు ప్రారంభం



12వతేదీన 'సాక్షి'లో ప్రచురితమైన కథనం

వెంకటాపురం(ఎం): ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తింపు పొందిన రామప్ప దేవాలయంలో సమస్యల పరిష్కారానికి తొలి అడుగుపడింది. ఆలయ గర్భగుడిలోని శివలింగానికి పంచామృతాలతో అభిషేకం చేస్తే ఆ ద్రవం బయటకు వెళ్లకుండా గర్భగుడిలోని సోమసూత్రం 23 ఏళ్ల క్రితమే మూసుకుపోయింది. దీనిపై 'సాక్షి' దినపత్రిక పలుమార్లు కథనాలు ప్రచురించింది. ఇందులోభాగంగా మహాశివరాత్రి సందర్భంగా మార్చి 12న 'అభిషేకం చేసేదెలా..! మూసుకుపోయిన సోమసూత్రం, 23 ఏళ్లుగా చిలకరింపు అభిషేకాలే' అనే కథనం ప్రచురితమైంది. దీంతో కేంద్ర పురావస్తుశాఖ అధికారుల్లో చలనం మొదలైంది. ఇందులో భాగంగా వారం రోజులుగా సోమసూత్రం పునరుద్ధరించేందుకు నిపుణుల సాయంతో రహస్యంగా పరిశీలన చేశారు. మంగళవారం గర్భగుడిలోని సోమసూత్రం వద్ద పూజలు నిర్వహించి డ్రిల్లింగ్ పనులు ప్రారంభించారు. బుధవారం కూడా డ్రిల్లింగ్ పనులు కొనసాగాయి. గర్భగుడి నుంచి సోమసూత్రానికి డ్రిల్లింగ్ వేయగా సుమారు మీటర్ వరకు క్లియర్ అయినట్లు తెలిసింది. ఆలయం బయట నుంచి రివర్స్‌గా గర్భగుడిలోకి డ్రిల్లింగ్ వేయగా సుమారు 1.5 మీటర్ వరకు క్లియర్ అయినట్లు స్థానిక సిబ్బంది పేర్కొన్నారు. మధ్యలో రాతి శృంగి అడ్డు రావడంతో తీవ్రంగా శ్రమించి డ్రిల్లింగ్ పనులు పూర్తి చేసినట్లు సిబ్బంది తెలిపారు. ఈ విషయమై పురావస్తుశాఖ జిల్లా అధికారి మల్లేష్‌ను 'సాక్షి' సంప్రదించగా రెండు రోజుల నుంచి డ్రిల్లింగ్ పనులు చేపట్టి సోమసూత్రాన్ని పునరుద్ధరించినట్లు వెల్లడించారు.

శరీరదాన అంగీకార పత్రాలు అందజేత



కేఎంసీ ప్రిన్సిపాల్‌కు అంగీకార పత్రాలు అందజేస్తున్న అసోసియేషన్ నాయకులు

ఎంజీఎం : తమ మరణాంతరం మృతదేహాలను కుటుంబ సభ్యుల ద్వారా వైద్య విద్య నిమిత్తం దానం చేస్తామని అంగీకారం తెలుపుతూ తెలంగాణ నేత్ర, అవయవ, శరీర దాతల అసోసియేషన్ ఉమ్మడి వరంగల్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో కాకతీయ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మోహన్‌దాస్, అనాటమీ అధిపతి డాక్టర్ పద్మజకు 25 మంది శరీర దాన (విల్) సర్టిఫికెట్స్ అందజేసినట్లు అసోసియేషన్ అధ్యక్షుడు కోనరెడ్డి మల్లారెడ్డి, ప్రధాన కార్యదర్శి శంకర్‌రావు యాదవ్ బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మరణాంతరం నేత్ర, అవయవ, శరీర దానం చేసి మానవాళికి మహాఉపకారం చేద్దామని పిలుపునిచ్చారు. శరీర దానం చేసే దాతలు 8790548706, 9703738699 నంబర్లను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు ఉపేందర్‌రెడ్డి, రాజేంద్రప్రసాద్, కేదారి, అనాటమీ సిబ్బంది మహబూబ్, ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో నిందితుడు?

కాజీపేట : చిరువ్యాపారుల దృష్టి మరల్చి వరుస చోరీలకు పాల్పడుతున్న కేసులో నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. కొంత కాలంగా గుర్తు తెలియని వ్యక్తి కాజీపేటలో పలు పూలు, పండ్లు, కూరగాయల దుకాణాల్లో చోరీలకు పాల్పడుతున్న విషయం విదితమే. కాగా, రెండు రోజుల క్రితం సదరు నిందితుడు బైక్‌పై కాజీపేట సెయింట్ జోసఫ్ చర్చి ఎదుట ప్రధాన రహదారిపై ఉన్న దుకాణానికి వచ్చి పండ్లు ప్యాక్‌చేసి ఇవ్వాలని వ్యాపారికి చెప్పాడు. అనంతరం అదును చూసి గల్లా పెట్టెలోని నగదు తీసుకుని ఉడాయించాడు. ఆ తర్వాత కొద్దిసేపటికి డబ్బులు చూసుకోగా కనిపించకపోవడంతో ఇంతకు ముందు వచ్చిన వ్యక్తి చేతిలో మోసపోయినట్లు గుర్తించిన చిరువ్యాపారి తాను ఏర్పాటు చేసుకున్న సీసీ ఫుటేజీని పోలీసులకు ఇచ్చి ఫిర్యాదు చేశారు. వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు సీసీ కెమెరాల్లో రికార్డు అయిన వాహనం నంబర్ ఆధారంగా నిందితుడిని పట్టుకున్నట్లు తెలుస్తోంది. దీంతో రెండు రోజుల నుంచి పట్టణంలో ఎక్కడా చోరీలు జరగకపోవడం కూడా నిందితుడు పోలీసుల అదుపులో ఉన్నట్లు వ్యాపారులు భావిస్తున్నారు. పోలీసులు మాత్రం అలాంటి విషయం ఏమిలేదని, విచారణ ఇంకా కొనసాగుతుందని చెబుతున్నారు.

అదుపు తప్పి ట్రాక్టర్ బోల్తా

- డ్రైవర్ మృతి
- జబ్బోనిగూడెం సమీపంలో ఘటన




యాకూబ్‌పాషా మృతదేహం

మంగపేట: మండలంలోని జబ్బోనిగూడెం సమీపంలోని మల్లూరు వాగు మధ్యతరహా ప్రాజెక్టు కాల్వలో బుధవారం అదుపు తప్పి ఓ ట్రాక్టర్ బోల్తా పడింది. ఈ ఘటనలో డ్రైవర్ ఎండి యాకూబ్ పాషా(38) మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం మండలంలోని బోరునర్సాపురం రెవెన్యూ పరిధిలోని గౌరారంవాగులో ఇసుక క్వారీ నిర్వాహకులు రోడ్లు వేస్తున్నారు. రోడ్ల నిర్మాణం కోసం జబ్బోనిగూడెం సమీపంలోని నెమళ్లగుట్ట అటవీ ప్రాంతం నుంచి ట్రాక్టర్ల ద్వారా మొరం తరలిస్తున్నారు. మొరం తోలేందుకు మండలంలోని కమలాపురం గ్రామానికి చెందిన ఆకుల ప్రభాకర్‌కు చెందిన ట్రాక్టర్‌పై డ్రైవర్‌గా వెళ్లిన యాకూబ్ పాషా.. మద్యం సేవించి ఉండడంతో మొరం లోడ్ చేసేందుకు జేసీబీ ఆపరేటర్ నిరాకరించాడు. దీంతో వెనుదిరిగి వస్తున్న క్రమంలో ట్రాక్టర్ అదుపు తప్పి కాల్వలో బోల్తా పడింది. ట్రాక్టర్ ఇంజన్ కింద ఇరుక్కుపోయి నీటిలో మునగడంతో యాకూబ్ పాషా అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎస్సై గోదరి రవికుమార్ ఘటనా స్థలికి చేరుకుని స్థానికుల సహకారంతో యాకూబ్ పాషా మృతదేహాన్ని బయటకు తీశారు. అనంతరం మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఏటూరునాగారం సామాజిక ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య రేష్మా, ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు.

ప్రాణం తీసిన యూటర్న్

● ఆర్టీసీ బస్సు ఢీకొని మహిళ మృతి



లక్ష్మి మృతదేహం

జనగామ: కూరగాయలు విక్రయించేందుకు ఇంటి నుంచి బయలుదేరిన గంటలో మృత్యువు వెంటాడింది. కూరగాయలు తీసుకుని శ్రీవిల్లాస్ కాలనీకి వెళ్లే క్రమంలో ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందింది. ఈ ఘటన బుధవారం జిల్లా కేంద్రంలో జరిగింది. ఎస్సై తిరుపతి కథనం ప్రకారం జనగామ జిల్లా లింగాలఘనపురం మండలం నాగారానికి చెందిన గోనెల లక్ష్మి(43) కూరగాయలు విక్రయించడానికి జిల్లా కేంద్రానికి వచ్చింది. శ్రీ విల్లాస్ కాలనీ వెళ్లే దారిలో యూటర్న్ తీసుకునే సమయంలో.. జనగామ నుంచి ఉప్పల్‌కు వెళ్తున్న హనుమకొండ డిపోనకు చెందిన ఆర్టీసీ బస్సు ఢీకొంది. దీంతో తీవ్రగాయాలు కావడంతో స్థానికులు హైదరాబాద్‌కు తరలిస్తున్న క్రమంలో మార్గమధ్యలో మృతిచెందింది. ఈ ఘటనపై మృతురాలి భర్త ఉప్పలయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. కాగా, జిల్లా కేంద్రంలో నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన యూటర్న్‌లపై కలెక్టర్ విచారణ జరిపించి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కమిటీ సిఫార్సులు వెల్లడించాలి

● రిజిస్ట్రార్ చాంబర్ వద్ద ఆందోళన, వాగ్వాదం



రిజిస్ట్రార్‌తో వాగ్వాదం చేస్తున్న విద్యార్థి సంఘాల బాధ్యులు, అభ్యర్థులు

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ పీహెచ్‌డీ అడ్మిషన్లలో అవకతవకలు జరిగాయని సీటు రాని అభ్యర్థులు, ఆయా విద్యార్థి సంఘాల బాధ్యులు ఆరోపించారు. ఈనేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల త్రిసభ్య కమిటీని నియమించగా కేయూలో విచారించిన విషయం విదితమే. అనంతరం త్రిసభ్య కమిటీ నివేదికను కూడా ప్రభుత్వానికి సమర్పించింది. పీహెచ్‌డీ అడ్మిషన్లకు సంబంధించి త్రిసభ్య కమిటీ పలు సిఫార్సులు చేసిందని, వాటిని ఈ నెల19న కేయూ అధికారులు పంపారని సమాచారం. దీంతో బుధవారం త్రిసభ్యకమిటీ ఇచ్చిన రికమండేషన్ల రిపోర్టుపై బుధవారం వివిధ విభాగాల డీన్లతో రిజిస్ట్రార్ మల్లారెడ్డి సమావేశం నిర్వహించి చర్చించారు. అనంతరం రిజిస్ట్రార్ తన చాంబర్‌కు రాగా త్రిసభ్యకమిటీ సిఫార్సుల్లో ఏముందో వెల్లడించాలని డిమాండ్ చేస్తూ వివిధ విద్యార్థి సంఘాల బాధ్యులు రిజిస్ట్రార్‌ను డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వాగ్వాదానికి దిగారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి వచ్చారు.